విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం





విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యురాలు జ్యోత్స్న తదితరులు

కీసర: గురుకుల పాఠశాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న అన్నారు. ఆదివారం కీసరగుట్టలోని తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్ సొసైటీ(టిఎస్ఈఐఎస్)స్కూల్‌తో పాటు, కీసరలోగల జ్యోతి రావుపూలే పాఠశాలను మేడ్చల్‌జిల్లా విద్యాధికారి విజయకుమారితో కలిసి పరిశీలించారు. పరిశుభ్రత, భోజన వసతి గురించి తెలుసుకొని సంతృప్తి వ్యక్తంచేసారు.

20 వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు

కీసర: ప్రధాన రహదారులు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కొకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మున్సిపల్ పరిధిలో శివాలయం నుండి ఎస్వీనగర్ రోడ్డు వరకు గల ప్రధాన రోడ్డులో మున్సిపల్ సిబ్బంది, పాలకవర్గం సభ్యులతో కలిసి క్లీనింగ్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో శుభ్రత కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ బండారి మల్లేష్‌యాదవ్, కమిషనర్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రహదారి శుభ్రత పనుల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

మేడ్చల్ రూరల్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఎంఈఓ రంగాచారి బహుమతులు ప్రదానం చేశారు.

రోడ్లను శుభ్రం చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్

ఘట్‌కేసర్: కాంగ్రెస్ సర్కారు గద్దెనెక్కి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మున్సిపాలిటీలో తెలంగాణ రైజింగ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈడబ్ల్యూఎస్ కాలనీ చౌరస్తాలో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య పారిశుద్ధ్య కార్మికులతో కలసి శ్రమదానంలో భాగంగా రోడ్లు శుభ్రం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శశికళ, జంగయ్యయాదవ్, శానిటేషన్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో రోడ్లను శుభ్రం చేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, కార్మికులు

రైల్వే వంతెన పనులు పూర్తిచేయాలి



ఘట్‌కేసర్‌లో సంఘీభావం తెలుపుతున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్

ఘట్‌కేసర్: రైల్వే వంతెన కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య కార్యచరణ కమిటీ (జేఏసీ)అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వే గేటు వద్ద ఆదివారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. కిరణ్, కరుణాకర్, ప్రమోద్‌గుప్త, సిరాజ్ దీక్షలు చేపట్టగా మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ రేసు లక్ష్మారెడ్డి సంఘీభావం తెలిపారు.

పిచ్చి మొక్కల తొలగింపు



కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలో ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని దమ్మాయిగూడ మున్సిపల్ వైస్ చైర్మెన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని ఓల్డ్ విలేజ్ నుండి పోచమ్మ గుడికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, ఖాళీ స్థలాలను చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ ఏ. నాగమణి, డి.ఈ.ఈ బాల మురళి, మేనేజర్ వెంకటేశం పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక మాసోత్సవాలు



కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరుడికి అన్నాభిషేకం



శివలింగాల వద్ద భక్తుల పూజలు

కీసర: గత నెల రోజుల పాటు ప్రఖ్యాతశైవ క్షేత్రమైన కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన కార్తీకమాసం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. కార్తీక మాసం చివరిరోజైన ఆదివారం అమావాస్య సందర్భంగా కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరుడికి అర్చకులు విశేషపూజలను నిర్వహించారు. కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు వివిధ ప్రాంతాలనుండి పెద్ద ఎత్తున తరలివచ్చారు.



దర్శనం కోసం క్యూ లైన్లలో నిల్చున్న భక్తులు

వరి కొనుగోళ్లు అంతంతే..!

- పౌరసరఫరా శాఖ అధికారుల నిర్లక్ష్యం
- వరి ధాన్యం కొనుగోళ్లు **7,215** మెట్రిక్ టన్నులు
- లక్ష్యం **25** వేల మెట్రిక్ టన్నులు
- రూ. **16.74** కోట్లకుగానూ... రైతులకు చెల్లించిన ధాన్యం సొమ్ము రూ. **11.28** కోట్లు



సాక్షి,సిటీబ్యూరో: వానా కాలంలో రైతు పండించిన వరి పంట ఉత్పత్తులకు సంబంధించిన ధాన్యం ఇప్పటి వరకు 7,215 మెట్రిక్ టన్నులు మాత్రమే జిల్లా పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేసింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పెరిగిన వరి పంట సాగునకు అనుగుణంగా పంట ఉత్పత్తులు పెరుగటంతో ...ఈ సీజన్‌లో రైతుల నుంచి 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యంగా 12 కేంద్రాలను ప్రారంభించారు. జిల్లాలో నిర్దేశించిన కొనుగోలు కేంద్రాలైన ప్రతాప్‌సింగారం ,ఏదులాబాద్ ,మాదారం, కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దమర్రి, కీసర, శామీర్‌పేట్, మేడ్చల్, జగ్గంగూడ, డబీల్‌పురా, పూడూరులలో 1,224 మంది రైతుల నుంచి ఇప్పటి వరకు 7,215.800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లా పౌరసరఫరాల సంస్థ ఖరీదు చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో 12 కేంద్రాల ద్వారా గ్రేడ్- ఏ ధాన్యానికి క్వింటాల్ ధర రూ. 2320 , కామన్ ధాన్యానికి క్వింటాల్ ధర రూ.2300 నిర్ణయించి కొనుగోలు చేశారు. జిల్లాలో 1,224 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యానికి సంబంధించి చెల్లించాల్సిన సొమ్ము రూ. 16.74 కోట్లు కాగా, ఇప్పటి వరకు 752 మంది రైతులకు రూ. 11.28 కోట్లు అందజేశారు. మిగతా 472 మంది రైతులకు రూ. 5.46 కోట్లు చెల్లించాల్సి ఉండగా, రెండు రోజుల్లో సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమ కాగలవని జిల్లా పౌరసరఫరాల సంస్థ జీఎం సుగుణ బాయి తెలిపారు.

బోనస్ చెల్లింపు ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అదనపు బోనసు కింద సన్న ధాన్యం విక్రయించిన 89 మంది రైతులకు రూ.22.20 లక్షలు చెల్లించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఈ ఏడాది(వానాకాలం) ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగు సాధారణ విస్తీర్ణం 15,066 ఎకరాలు కాగా, రైతులు 17,500 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. పెరిగిన వరి పంట సాగుతో 40 వేల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు(ధాన్యం) రాగలవని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా 12 కేంద్రాల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్ధతు ధరతో ధాన్యం సేకరణ చేపడుతోంది.

గతేడాది కొనుగోళ్లు **9,834** మెట్రిక్ టన్నులే..

గతేడాది వానాకాలంలో మేడ్చల్ జిల్లాలో 16,999 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేయగా, దాదాపు 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశముందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన సివిల్ సప్లై సంస్థ ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధరతో 1810 మంది రైతుల నుంచి 9,834.880 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది.దీనికి సంబంధించి రైతులకు రూ.21.67కోట్లు చెల్లించారు.

ఏటూరు నాగారం ఎన్‌కౌంటర్ ఓ బూటకం

జవహర్‌నగర్: ములుగు జిల్లా ఏటూరు నాగారం ఏజెన్సీ ప్రాంతంలో ఆదివారం ఎన్‌కౌంటర్ పేరుతో ఏడుగురిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని ఇఫ్టూ జాతీయ, రాష్ట్ర కార్యదర్శులు షేక్ షావలి, కర్నాటి మల్లేష్, ఐపీఓడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పెర్క సునీత తెలిపారు. ఆదివారం జవహర్‌నగర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్‌కౌంటర్ ఒక బూటకమని, ఎన్‌కౌంటర్ పేరుతో ఏడుగురిని హతమార్చిన రాష్ట్ర ప్రభుత్వ పోలీస్ చర్యలను తీవ్రంగా ఖండించారు. ఈ ఎన్‌కౌంటర్‌ని రాష్ట్ర ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి అదృశ్యం



బాలాజీ గణపతి

మేడ్చల్ రూరల్: పాఠశాలకు వెళ్లేందుకు ఇంటి నుండి వెళ్లిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. మేడ్చల్ ఎస్ఐ అశోక్ కుమార్ తెలిపిన మేరకు.. గౌడవెళ్లి గ్రామానికి చెందిన బాలాజీ గణపతి(16) మేడ్చల్ ఈ నెల 26న స్కూల్‌కు వెళ్లేందుకు ఇంటి నుండి వెళ్లిన తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో ఆచూకీ వెతికినా ఫలితం లేకపోవడంతో తండ్రి ఆనంద్‌రావు మేడ్చల్ పోలీసులను ఆశ్రయించాడు.

మృతుడి కుటుంబీకులకు ఆర్థిక సాయం



మృతుడి కుటుంబీకులను పరామర్శిస్తున్న చైర్ పర్సన్ పావనీ జంగయ్య దంపతులు

ఘట్‌కేసర్: మున్సిపల్ కార్మికుడు కట్ల మనోజ్ శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ జంగయ్య దంపతులు పట్టణంలోని కార్మికుడి నివాసానికి ఆదివారం ఉదయం వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. అంత్యక్రియల కోసం మున్సిపల్ కార్యలయం ఆధ్వర్యంలో రూ. 10 వేలు, చైర్ పర్సన్ సొంత డబ్బు రూ. 5 వేలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శరన్ రాయ్ (ఫైల్)

కీసర: గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన మేరకు.. బీహార్‌కు చెందిన షియా శరన్‌రాయ్(37)శనివారం రాత్రి నాగారం మున్సిపల్ సుర్వీబాబయ్య ఫంక్షన్‌హాల్ ఎదురుగా రోడ్డు దాటుతున్నాడు. గుర్తు తెలియని వాహనం అతనిని ఢీకొంది. స్థానికులు ఆస్పత్రికి తరలించగా తీవ్రంగా గాయపడ్డ శరన్‌రాయ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పార్కు సుందరీకరణకు నిధులు కేటాయించండి



ఎంపీ ఈటలకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన బీజేపీ నాయకులు ఆదివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిశారు. మున్సిపల్ నాల్గవ వార్డు కౌన్సిలర్ అమరం సరస్వతి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పూడూర్ గ్రామ పరిధిలోని ఎంపీ నివాసంలో ఆయనను కలిసి మున్సిపల్ పరిధిలోని ఏజీ కాలనీలో ఉన్న పార్కు సుందరీకరణకు ఎంపీ నిధులు కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్ రెడ్డి, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ ఉదిరాజ్, కౌన్సిలర్లు మల్లిఖార్జున్ ముదిరాజ్, కాలనీ అధ్యక్షులు మహేశ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కిష్టయ్య ముదిరాజ్‌కు ఘన నివాళి



పోలీస్ కిష్టయ్య ముదిరాజ్‌కు నివాళులర్పిస్తున్న చైర్ పర్సన్ పావనీ జంగయ్య

ఘట్‌కేసర్: తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు, స్వరాష్ట్ర సాధనలో ఆత్మబలిదానం చేసుకున్న పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ 15వ వర్ధంతిని ఘట్‌కేసర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్యహాజరయ్యారు. మాజీ సర్పంచులు యాదగిరియాదవ్, వెంకటేశ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఉత్తమ వ్యాపారవేత్తలుగా ఎదగాలి



స్నాతకోత్సవంలో పాల్గొన్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్ రూరల్: మేనేజ్‌మెంట్ విద్య పూర్తి చేసుకుని బయటి ప్రపంచంలోకి అడుగుపెడుతున్న విద్యార్థులు మంచి వ్యాపారవేత్తలుగా ఎదగాలని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని ధ్రువ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 28వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి పాల్గొన్న గవర్నర్ ఎంబీఏ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. ఉత్తమ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ బహుకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ధ్రువ కళాశాల కార్యదర్శి మాధవి,ధృవ గవర్నింగ్ మెంబర్ రవిందర్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కారును వేగంగా నడిపిన కానిస్టేబుల్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్–ఎదులాబాద్ అండర్ పాస్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. సీఐ పరుశురాం తెలిపిన మేరకు.. ఎంకిర్యాల్‌కు చెందిన తంబాలి నవీన్ కుమార్(25), మెరుగు సాయిచరణ్ (19) గ్రామం నుంచి ఘట్‌కేసర్‌కు ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఘట్‌కేసర్ పీఎస్‌కు చెందిన కానిస్టేబుల్ రాజేశ్ కారును వేగంగా నడుపుతూ వారిని ఢీకొట్టాడు. దీంతో వారు గాయపడ్డారు.స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు.పోలీసులు కానిస్టేబుల్ రాజేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మల్లాపూర్: మల్లాపూర్ జడ్పీ పాఠశాల 2007–08 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళానాన్ని ఆదివారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. టీచర్లు రంగారెడ్డి, చిక్క నర్సింహ, విమల, మంజుల, దేవి, గీత, సునందా, నిర్వాహకులు శివకుమార్, నరేశ్, శ్రీరాములు, పుణ్యవతి, స్వాతి పాల్గొన్నారు.



విద్యార్థులు దేశాభివృద్ధికి కృషిచేయాలి



కీసర: విద్యార్థులు చదువులో రాణించి దేశాభివృద్ధికి తమ వంతు కృషిచేయాలని బ్రిగేడియర్ ఎస్‌కె ప్రసాద్(వెటరన్) అన్నారు. శనివారం రాత్రి నిర్వహించిన రాంపల్లి జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడుతాయన్నారు. జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ మురళీ ముకుంద్, ప్రిన్సిపల్ బి.పద్మజరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది.

పరిసరాలు శుభ్రం చేసిన నాయకులు



పారిశుద్ధ్య కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, నాయకులు

మేడ్చల్: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మేడ్చల్ మున్సిపాలిటీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పలు వార్డులలో చెత్తను తొలగించి,రోడ్లను ఊడ్చి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న ప్రసాదం వితరణ



అన్నదాన కార్యక్రమంలో భక్తులు

మేడ్చల్ రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి పూడూర్ గ్రామ పరిధిలోని రామభక్త ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు,గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

సమానత్వం కోసం పోరాడిన అంబేడ్కర్

ఘట్‌కేసర్: స్వేచ్ఛ, సమానత్వం కోసం అంబేడ్కర్ పోరాటం చేశారని మర్పల్లిగూడ కౌండిన్య యువజన సంఘం అధ్యక్షుడు రాముగౌడ్ అన్నారు. ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి ప్రతిజ్ఞ చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబేడ్కర్ ఏ ఒక్క వర్గం గురించి ఆలోచించలేదని, దేశ ప్రజల గురించి పని చేశారన్నారు. కార్యక్రమంలో దాసు, శ్రీనివాస్, కె నర్సింగ్‌రావు, మహేశ్‌గౌడ్, సత్యం, రాజేశ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నదానం




కీసర: ఆదివారం అమావాస్య సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాగారం ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని జననీ హాస్పిటల్ సమీపంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నాగారం మున్సిపల్ చైర్మెన్ కొకుట్ల ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ సుమిత్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

శామీర్‌పేట్: కాంగ్రెస్ పాలనలో విద్యవ్యవస్థ నిర్వీర్యమైందని డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ రామిడి మధుకర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్‌వీ గురుకులం బాట కార్యక్రమంలో భాగంగా మూడుచింతలపల్లి మండలం, జగ్గంగూడలోని మైనార్టీ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉన్నత మైన విద్యతో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందించారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విద్యార్థులకు అందిస్తున్న ఆహారం పాయిజన్‌గా మారడంతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన కార్యదర్శులు అనిల్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నాయకులు పవన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

4న తుర్కపల్లిలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభం



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం తుర్కపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం 6 పడకల ఆసుపత్రిని ఈ నెల 4న రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి రామోదర రాజనర్సింహ ప్రారంభిస్తారని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఎ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఆసుపత్రి మరమతు పనులను పరిశీలించారు.

మండలస్థాయిలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం

సాక్షి,సిటీబ్యూరో : ప్రజా పాలన –ప్రజా విజయోత్సవాలలో భాగంగా విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని వివిధ మండలాలలో ఆదివారం విద్యార్థులకు ' రెన్యువబుల్ ఎనర్జీ రిసోర్సెస్' అనే అంశంపై వ్యాసరచన పోటీలను జిల్లా విద్యాశాఖ నిర్వహించింది. ఇందులో పదుల సంఖ్యలో విద్యార్థులు భాగస్వామ్యం పంచుకోగా, ప్రతి మండలంలోనూ ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ) విజయకుమారి తదితరులు అందజేశారు. మండలాల వారిగా బహుమతులను గెలు పొందిన విద్యార్థులు సోమవారం మల్కాజిగిరి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించబోయే జిల్లాస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. మండలాల్లో గెలుపొందిన విద్యార్థులకు మల్కాజిగిరి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీలకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది.